తలాపునే నీరున్నా..!

- అడుగంటిన భూగర్భజలాలు
- వట్టిపోయిన బోర్లు, బావులు
- వర్షాధారంపైనే పంటల సాగు
- గడ్డెన్నవాగు నీరందిస్తే మేలు
- ఏళ్లుగా భైంసా రైతుల నిరీక్షణ



శనగ దిగుబడి రాక పడావుగా వదిలేసిన దృశ్యం

భైంసాటౌన్: తలాపునే నీరున్నా.. వర్షంపైనే ఆధారపడి పంటలు సాగు చేయాల్సిన పరిస్థితి భైంసా పట్టణ శివారు రైతులది. భైంసా–నాందేడ్ మార్గంలో దాదాపు వంద వరకు ఎకరాల్లో వర్షాధారంపైనే సాగు చేస్తున్నారు. బోరుబావుల్లో నీరు పడకపోవడంతో వానాకాలంలో వర్షాధారిత పత్తి, సోయా పంటలు మాత్రమే సాగు చేస్తున్నారు. భైంసా–నాందేడ్ రోడ్డుకు ఓ వైపున గడ్డెన్నవాగు ప్రాజెక్టు బ్యాక్ వాటర్‌తో భూగర్భ జలాలు సమృద్ధిగా ఉండడంతో బోరుబావుల్లో నీరు పడుతోంది. కానీ, అదే రోడ్డుకు మరోవైపు భూముల్లో ఎన్ని బోర్లు వేసినా నీరు పడడం లేదని రైతులు వాపోతున్నారు. దీంతో యాసంగిలో శనగ సాగు చేసినా భూమిలో తేమ లేకపోవడంతో ఆశించిన మేర దిగుబడి రావడం లేదని వాపోతున్నారు. దీంతో కొందరు రైతులు యాసంగిలో భూములను పడావుగా వదిలేస్తున్నామని పేర్కొంటున్నారు. పక్కనే గడ్డెన్నవాగు ప్రాజెక్టు నుంచి కాలువ తవ్వించి నీరందిస్తే రెండు పంటలు సాగు చేసుకుంటామని రైతులు కోరుతున్నారు. అధికారులు ఆ దిశగా చర్యలు తీసుకోవాలని వేడుకుంటున్నారు.

యాసంగి సాగుకు తిప్పలు

దస్తురాబాద్: యాసంగి పంటల సాగుకు నీటి కోసం రైతులు తిప్పలు పడుతున్నారు. ఏటా కడెం ప్రాజెక్టు ఎడమ కాల్వ ద్వారా పంటలకు నీరందేది. గత వర్షాకాలంలో భారీ వర్షాలకు కడెం ప్రాజెక్టు దెబ్బతినడం, గేట్ల మరమ్మతు చేపడుతుండడంతో నీరందించలేని అధికారులు పేర్కొన్నారు. దీంతో రైతులు పేర్కపల్లే, మున్యాల, ఎర్రగుంట, గోడిసీర్యాల, దస్తురాబాద్, ఆకోండపేట, రేవోజీపేట, మల్లాపూర్, బుట్టాపూర్ గ్రామాల్లో సుమారు 200 నూతన బావులను జేసీబీతో తీయించారు. కడెం ప్రాజెక్టు ఎడమ కాల్వ ద్వారా మండలంలో ప్రతిఏటా యాసంగిలో 10 వేల ఎకరాల్లో వరి సాగయ్యేది. కాని ఈ ఏటా 5,600 ఎకరాల్లో సాగవుతున్నట్లు వ్యవసాయ అధికారులు తెలిపారు.



జేసీబీలతో బావుల తవ్వకాలు

బావులు తీయించాం



యాసంగి పంటకు కడెం ప్రాజెక్టు నీరందడం లేదు. పొలాల్లో నూతనంగా వ్యవసాయ బావులను జేసీబీలతో తవ్వించాం. ఒక్క బావి తవ్వించాలంటే రూ.60 వేల నుంచి రూ.80 వేలు ఖర్చయింది.

– కోయ్యాడి రాజేష్, రైతు, రాంపూర్

క్లుప్తంగా

వరి పంటల పరిశీలన



సోన్‌లో పంటను పరిశీలిస్తున్న డీఏవో అంజిప్రసాద్

సోన్: మండల కేంద్రంలో వరి పంటను డీఏవో అంజిప్రసాద్ శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం వరి పంటలో ఆకుఎండు, అగ్గి తెగులు ఆశించిందన్నారు. ఆకుఎండు తెగులు నివారణకు కాపర్ ఆక్సిక్లోరైడ్ 30 గ్రాములు, ప్లాంటోమైసిన్ 4 గ్రాములు 10 లీటర్ల నీటిలో కలిపి వారం వ్యవధిలో రెండు, మూడు సార్లు పిచికారి చేయాలన్నారు. అగ్గితెగులు నివారణకు ట్రై సైక్లజిల్ 120 గ్రాములు ఎకరాకు పిచికారి చేయాలని రైతులకు సూచించారు. అంతకుముందు పాక్‌పట్ల గ్రామంలో పీఎం కిసాన్ నిధుల కోసం రైతులు ఈకేవైసీ చేసుకోవాలన్నారు. ఏవో వినోద్, ఏఈవో అంబాజీ, అశోక్ తదితరులు ఉన్నారు.

వరిసాగులో జాగ్రత్తలు పాటించాలి

కుంటాల: వరిసాగులో రైతులు జాగ్రత్తలు పాటించాలని ఏవో సోమ లింగారెడ్డి సూచించారు. మండలంలోని విఠాపూర్ గ్రామంలో వరి పంటలను శనివారం పరిశీలించారు. పంటకు మొగిపురుగు ఉధృతి ఉందని గుర్తించారు. నివారణకు లాంఢ్డా సిలోత్రిన్ 30 మి.లీ, కస్టోడియ 30 మి.లీ లేదా జింక్ సల్ఫేట్ 30 గ్రాముల ఒక లీటర్ పంపు డబ్బాకి కలిపి పిచికారి చేయాలన్నారు. ఏఈవో గణేశ్, రైతులు ఉన్నారు.

అనారోగ్యంతో కౌన్సిలర్ మృతి



బాల రవీందర్ (ఫైల్)

నిర్మల్‌టౌన్: పట్టణంలోని శాంతినగర్‌కాలనీ 12వ వార్డు కౌన్సిలర్ సంపంగి బాల రవీందర్ అనారోగ్యంతో ఇంట్లోనే శనివారం మృతిచెందాడు. కొన్నిరోజులుగా క్యాన్సర్‌తో బాధపడుతున్నాడు. బీఆర్ఎస్ నుంచి పోటీ చేసి కౌన్సిలర్‌గా గెలుపొందాడు. ఈయనకు భార్య ఇద్దరు కుమారులు ఉన్నారు. మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్ వారి నివాసానికి వెళ్లి పార్థివదేహం వద్ద నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు.

ఎమ్మెల్యే నందితకు నివాళి



నివాళులర్పిస్తున్న నాయకులు

ఖానాపూర్: రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన సికింద్రాబాద్ కంటోన్మెంట్ ఎమ్మెల్యే లాస్య నందితకు బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నివాళులర్పించారు. పట్టణంలోని జగన్నాథ్‌రావు చౌరస్తా వద్ద ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. నాయకులు రాజగంగన్న, రామునాయక్, వాల్‌సింగ్, ఖలీల్, శ్రావన్, ప్రదీప్, వెంకటప్పయ్య, లక్ష్మణ్, సుమన్, రమేశ్, దివాకర్ తదితరులు ఉన్నారు.

సీసీరోడ్డు పనులు ప్రారంభం



ప్రారంబిస్తున్న జెడ్పీటీసీ రాజేశ్వర్‌రెడ్డి

సారంగాపూర్: మండలంలోని మలక్‌చించోలి గ్రామంలో ఎన్ఆర్ఈజీఎస్ నిధులు రూ.6 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్డు పనులను జెడ్పీటీసీ పత్తిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి శనివారం ప్రారంభించారు. నాయకులు దశరథ రాజేశ్వర్, బొల్లోజి నర్సయ్య, సలీమ్, గ్రామస్తులు ఉన్నారు.

భైంసారూరల్: గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానని ఎంపీపీ అబ్దుల్ రజాక్ అన్నారు. మండలంలోని కుంబి గ్రామంలో రూ.10 లక్షలతో చేపట్టే సీసీ రోడ్డు పనులకు శనివారం భూమిపూజచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని గ్రామాల్లో సీసీ రోడ్లు నిర్మాణం చేపడుతున్నట్లు వెల్లడించారు. నాయకులు పండిత్‌రావు, శంకర్, బాలాజీ తదితరులు ఉన్నారు.

భైంసారూరల్: మండలంలోని వానల్‌పాడ్ గ్రామంలో ఎన్ఆర్ఈజీఎస్‌లో భాగంగా జరుగుతున్న సీసీ రోడ్డు పనులను ఎంపీడీవో సుధాకర్‌రెడ్డి శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాణ్యతతో కూడిన సీసీ రోడ్డు పనులు చేపట్టాలని సూచించారు. ఆయన వెంట సీనియర్ అసిస్టెంట్ సురేశ్‌గౌడ్, నాయకులు రాంకుమార్, గణేశ్‌పటేల్, ఈశ్వర్, రాహుల్ తదితరులు ఉన్నారు.

బస్టాండ్‌లో పారిశుధ్య పనులు

సాక్షి స్పందన

ఖానాపూర్: పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో నెలకొన్న సమస్యలపై 'బస్టాండ్‌లో సౌకర్యాలేవీ' శీర్షికన శనివారం సాక్షిలో ప్రచురితమైన కథనానికి మున్సిపల్ అధికారులు స్పందించారు. కమిషనర్ మనోహన్ ఆదేశాల మేరకు సిబ్బంది ముమ్మరంగా పారిశుధ్య పనులు చేపట్టారు. బస్టాండ్ వెనక భాగంలోని డ్రైయినేజీలో పూడిక, పిచ్చిమొక్కలు, చెత్తాచెదారాన్ని తొలగించారు. కంట్రోలర్ కలీమొద్దిన్, జెట్టి శంకర్, మున్సిపల్ శానిటేషన్ సూపర్‌వైజర్ మానాల శంకర్ ఉన్నారు.



పిచ్చిమొక్కలు తొలగిస్తున్న మున్సిపల్ సిబ్బంది

ఎంపీడీవో బాధ్యతల స్వీకరణ

కుభీర్: ఎంపీడీవోగా శ్రీనివాస్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో మాజీ సర్పంచులు ఆయన్ను సన్మానించి అభినందనలు తెలిపారు. చంద్రకాంత్, శంకర్, రాజేష్, రాజేందర్, అశోక్ ఉన్నారు.



శ్రీనివాస్‌కు సన్మానిస్తున్న మాజీ సర్పంచ్‌లు

సంక్షిప్తంగా

బ్లాంకెట్ల పంపిణీ

లక్ష్మణచాంద: బాబాపూర్‌లో వరల్డ్ విజన్ ఆధ్వర్యంలో శనివారం 135 మంది విద్యార్థులకు బ్లాంకెట్లు పంపిణీ చేశారు. బీజేపీ మండల నాయకుడు అడ్వాల రమేశ్, సంస్థ జిల్లా మేనేజర్ బ్రహ్మన్న, మాజీ సర్పంచ్ శ్రీవిద్య, వీడీసీ అధ్యక్షుడు రమేశ్, ప్రోగ్రాం కోఆర్డినేటర్ కరుణ్ కుమార్ పాల్గొన్నారు.

కుట్టుమిషన్ తప్పనిసరి

నిర్మల్‌చైన్‌గేట్: జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల జుమ్మెరత్‌పేట్‌లో ఈనెల 25 నుంచి 27 వరకు నిర్వహించే టైలరింగ్, ఎంబ్రాయిడరీ పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులు కుట్టుమిషన్ తప్పనిసరిగా తీసుకురావాలని చీఫ్ సూపరింటెండెంట్ గజ్జరామ్ ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పరీక్ష ఉంటుందని పేర్కొన్నారు.

డిగ్రీ కళాశాలలో అవగాహన

భైంసాటౌన్: పట్టణంలోని జీఆర్పీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ×జాతీయ ఆదాయం–ప్రధాన భావనలు×అనే అంశంపై నిజామాబాద్ గిరిరాజ్ కళాశాలకు చెందిన అధ్యాపకులు వేణుప్రసాద్ ఉపన్యాసం ఇచ్చారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ సుధాకర్, అధ్యాపకులు పాల్గొన్నారు.

కూరగాయల నారు పంపిణీ

కుభీర్: మండలంలోని పార్డి(బి) రైతు వేదికలో రిలయన్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం రైతులకు కూరగాయల నారు పంపిణీ చేశారు. బెండకాయ, వంకాయ, టమాట మొక్కలను అందజేశారు. పార్డి(బి), చాత, వీర్‌గాం, జుమ్డ, కస్రా, జామ్‌గాం గ్రామాల రైతులకు మొక్కలు అందించినట్లు సంస్థ కోఆర్డినేటర్ భాగ్య తెలిపారు.

కాంగ్రెస్‌లో చేరిక

సారంగపూర్: కొట్ల(బి) పీఏసీఎస్ డైరెక్టర్ ప్రవీణ్ బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరారు. డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావు నివాసంలో శనివారం ఆయనకు పార్టీ కండువా కప్పారు. కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

నానో యూరియాపై అవగాహన

ఖానాపూర్: పాత తర్లపాడ్ గ్రామంలో డ్రీమ్‌సొసైటీ ఆధ్వర్యంలో నానో యూరియాపై శనివారం రైతులకు అవగాహన కల్పించారు. నానో యూరియా ద్వారా మొక్కల్లో పచ్చదనం, చురుకైన పెరుగుదల, పంటల అభివృద్ధిలో దోహదపడుతుందన్నారు. నానో యూరియా నత్రజని అందించే ఎరువు అని అన్నారు. చిన్నయ్య, రవి, రాకేశ్ ఉన్నారు.

సంత్ శిరోమణి శ్రీ గురు మహారాజ్ జయంతి

ముధోల్: మండల కేంద్రంలో మోచి సంఘం, హిందువాహిని ఆధ్వర్యంలో సంత్ శిరోమణి శ్రీ గురు రవిదాస్ మహారాజ్ జయంతిని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నాయకులు దేవోజీ భూమేష్, జీవన్, లవణ్, మోచి సంఘం పెద్దలు సాయిలు, భూమేష్, భోజన్న, విఠల్, గంగాధర్, నరేశ్, హిందువాహిని కార్యకర్తలు చరణ్, రవి, సాయి, శ్రీహరి, ప్రవీణ్ ఉన్నారు.

ఈకేవైసీ చేసుకోవాలి

పెంబి: పీఎం కిసాన్ పథకంలో భాగంగా రైతులు ఈకేవైసీ తప్పనిసరిగా చేసుకోవాలని ఏఈవో రాజ్‌కుమార్ పేర్కొన్నారు. మండల కేంద్రంలో శనివారం ఈకేవైసీ క్యాంపు నిర్వహించారు. దాదాపు 60 మంది రైతులకు ఈకేవైసీ చేసుకున్నారు. ఈకేవైసీ చేయనివారు మండల కేంద్రంలో సోమవారం క్యాంపు ఉంటుందని పేర్కొన్నారు. ఖానాపూర్ డివిజన్ అగ్రికల్చర్ టెక్నాలజీ మేనేజర్ సాయి కిరణ్‌గౌడ్, రైతులు ఉన్నారు.

పంజాబ్ రైతులపై దాడిని ఖండిస్తున్నాం

లక్ష్మణచాంద: పంజాబ్ రైతులపై పోలీసులు జరిపిన దాడిని ఖండిస్తున్నామని సీపీఐ(ఎంఎల్) జిల్లా కార్యవర్గ సభ్యులు గంగన్న ఓ ప్రకటనలో పేర్కొన్నారు. గత రెండు రోజుల కింద హర్యానా, పంజాబ్ సరిహద్దుల్లో హర్యానా పోలీసులు జరిపిన కాల్పుల్లో బటిండా జిల్లాలోని బాలన్ గ్రామానికి చెందిన 24 ఏళ్ల యువరైతు శుభకరన్ సింగ్ మృతిచెందారని పేర్కొన్నారు. పోలీసులను అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు.

ముగిసిన సమ్మక్క సారలమ్మ జాతర

ముధోల్: మండలంలోని ఎడ్‌బిడ్ తండా గ్రామంలో కొనసాగుతున్న సమ్మక్క–సారలమ్మ జాతర శనివారంతో ముగిసింది. మూడు రోజులుగా భక్తులు అధిక సంఖ్య తరలివచ్చి మొక్కు చెల్లించుకున్నారు. నిలువెత్తు బంగారాన్ని సమర్పించారు. సమ్మక్క–సారలమ్మకు ప్రత్యేక పూజలు చేశారు. శనివారం రాత్రి సమ్మక్క సారలమ్మ వన ప్రవేశంతో జాతర ముగిసింది.

ఒకరికి గాయాలు

కుభీర్: మండలంలోని పాత సాంవ్లి గ్రామానికి చెందిన ఠాకూర్ శేషభాయి(40) శనివారం ఉపాధి పనులు చేస్తున్నాడు. ఈ క్రమంలో అదుపు తప్పి గడ్డపార కాలుపై పడటంతో గాయాలయ్యాయి. ఉపాధి కూలీని అధికారులు ఆదుకోవాలని మాజీ సర్పంచ్ సాయినాథ్ కోరారు.

అల్పాహారానికి చేయూత

ఖానాపూర్: మండలంలోని మస్కాపూర్ గ్రామంలోని 126 మంది పది విద్యార్థులకు అదనపు తరగతుల నిర్వహణ సమయంలో అల్పాహారం అందించేందుకు ఉపాధ్యాయులు ముందుకొచ్చారు. ఉపాధ్యాయులు సొంత ఖర్చులతో అల్పాహారం అందించేలా చర్యలు చేపట్టామని హెచ్ఎం నరెందర్‌రెడ్డి తెలిపారు. ఉపాధ్యాయులు ఉన్నారు.

నేడు అన్నబావుసాఠె విగ్రహావిష్కరణ

తానూరు: మండలంలోని ఉమ్రి(కే) గ్రామంలో నూతనంగా నిర్మించిన అన్నబావుసాఠె విగ్రహావిష్కరణ ఆదివారం నిర్వహించనున్నట్లు జెడ్పీటీసీ మాజీ సభ్యుడు ఉత్తం బాలేరావ్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి నాయకులు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు.

నేటి నుంచి ఆలయ వార్షికోత్సవం

లక్ష్మణచాంద: వడ్యాల్‌లో ఆదివారం నుంచి ఈనెల 27 వరకు రేణుక మాత ఆలయ 7వ వార్షికోత్సవానికి అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఇప్పటికే ఆలయాన్ని ముస్తాబు చేశారు. లక్ష్మణచాంద, మామడ మండలాలకు చెందిన గౌడ సంఘాల ఆధ్వర్యంలో వడ్యాల్‌లో ఆలయాన్ని నిర్మించారు.

మున్సిపల్ వైస్ చైర్మన్ పదవిని కేటాయించాలి



మాట్లాడుతున్న మసీదు కమిటీ సభ్యులు

ఖానాపూర్: ఈనెల 28న మున్సిపల్ చైర్మన్, వైస్‌చైర్మన్ ఎన్నిక నేపథ్యంలో వైస్ చైర్మన్ పదవిని మైనార్టీలకు కేటాయించాలని మసీదు కమిటీల అధ్యక్ష, కార్యదర్శులు, సభ్యులు కోరారు. స్థానిక ఆర్అండ్‌బీ విశ్రాంతిభవనంలో శనివారం మహ్మదీయ మసీదు, జామా, మదీనా, కరీం కాలనీ, అర్ఫత్, యాకుబ్, రహీం, కదీం మసీదుల కమిటీ సభ్యుల సమావేశం నిర్వహించారు. గతంలో అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వం మున్సిపల్ ఎన్నికల్లో మైనార్టీలకు వైస్ చైర్మన్‌ను కేటాయించిందన్నారు. 28న ఎన్నిక సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వం మైనార్టీలను ఏవిధంగా ఆదరిస్తుందో తెలుస్తుందన్నారు. తమ మసీదు కమిటీలతో పాటు ముస్లిం జేఏసీ, ముస్లిం డెవలప్‌మెంట్ కమిటీ తరపున ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుకు విన్నవిస్తున్నామని తెలిపారు. సమావేశంలో బషీర్, అహ్మద్‌ఖాన్, ఫహీం, సల్తార్, షౌకత్‌పాషా, అబ్దుల్‌గని, హుస్సేన్, ఆమెర్ తదితరులు పాల్గొన్నారు.

బదిలీపై వెళ్లిన ఎస్సైకి సన్మానం



హన్మాండ్లును సన్మానిస్తున్న సిబ్బంది

కుంటాల: ఎస్సై హన్మాండ్లు బదిలీపై పెంబి పోలీస్ స్టేషన్‌కు వెళ్తున్న సందర్భంగా సిబ్బంది, ప్రజాప్రతినిధులు, అధికారులు సన్మానించారు. పెంబి ఎస్సై రజనీకాంత్ ఇక్కడికి బదిలీపై రానున్నారు.

బీజేపీలో చేరిక

ముధోల్: మండలంలోని బోరిగాం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ ఎంపీటీసీ జ్యోతి దేవన్న బీజేపీలో చేరారు. శనివారం ఆయనకు ఎమ్మెల్యే రామారావు పాటిల్ కండువా కప్పారు.

మహిళల ఆర్థికాభివృద్ధికి కృషి

కుంటాల: స్వయం సహాయక సంఘాల మహిళల ఆర్థికాభివృద్ధికి కృషి చేయాలని సీసీలు పెంటన్న, యూసుఫ్, కవిత సూచించారు. మండలంలోని కల్లూర్, ఓలా, కుంటాల వీవోఏలకు స్త్రీనిధి, బ్యాంకు లింకేజీ, లోకోస్ డాటా ఎంట్రీ తదితర వాటిపై శనివారం అవగాహన కల్పించారు. గ్రామాల్లో కేంద్ర ప్రభుత్వం చేపట్టిన లఖ్‌పతీ దీదీ పథకంపై ప్రతీ మహిళకు అవగాహన కల్పించాలన్నారు.

విద్యార్థుల క్షేత్రపర్యటన

ఖానాపూర్: మండలంలోని మస్కాపూర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులు క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా పంటలను పరిశీలించారు. నాల్గవ శనివారం నో బ్యాగ్ డేను పురస్కరించుకుని పంటల పెరుగుదల, ఆయిల్‌పాం తోటలను సందర్శించారు.ఇన్‌చార్జి హెచ్ఎం లింగమూర్తి, ఉపాధ్యాయులు మురళిధర్, ప్రవళిక, మానస, శ్రీజ ఉన్నారు.

ఆధ్యాత్మికం

వైభవంగా వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణం



కల్యాణంలో పాల్గొన్న భక్తులు

నిర్మల్‌టౌన్/నిర్మల్‌చైన్‌గేట్: జిల్లాకేంద్రంలోని పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి గోవిందమ్మ కల్యాణ మహోత్సవాన్ని శనివారం వైభవంగా నిర్వహించారు. స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. పండితులు వేద మంత్రోచ్ఛరణాల మధ్య కల్యాణ తంతు ప్రక్రియ జరిపారు. పూజార్లు శ్రీరాములు నాగేష్, వెంకటాచారి, పట్టణ విశ్వబ్రాహ్మణ సంఘం గౌరవ అధ్యక్షుడు అశోక్, అధ్యక్షుడు వెంకటరమణ, ప్రధాన కార్యదర్శి బ్రహ్మయ్యచారి, కోశాధికారి శివకుమార్ పాల్గొన్నారు. అదేవిధంగా డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావు హాజరై పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన్ను విశ్వబ్రాహ్మణ సంఘం పట్టణ నాయకుడు శివకుమార్, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో సన్మానించారు. శేఖర్, మాజీ సర్పంచ్ పద్మాకర్, రవికుమార్, సామ వికాస్ ఉన్నారు.

ఘనంగా బ్రహ్మంగారి కల్యాణం



కద్తాల్‌లో బ్రహ్మంగారి కల్యాణంలో పాల్గొన్న భకులు

సోన్: మండలంలోని కూచన్‌పెల్లి, కద్తాల్ గ్రామాల్లో శనివారం శ్రీ పోతులూరి వీరా బ్రహ్మం–గోవిందమ్మ కల్యాణం కనులపండువగా జరిగింది. కద్తాల్ గ్రామంలో బ్రహ్మంగారి ఆశ్రమం ద్వితీయ వార్షికోత్సవం పురస్కరించుకొని వ్యవస్థాపకుడు శ్రీరామనంద స్వామి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, హోమం చేపట్టారు. పండితుల వేద మంత్రోచ్ఛారణలతో కల్యాణ తంతు జరిపించారు. కూచన్‌పెల్లిలో డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు ఆయనకు శాలువా కప్పి సత్కరించారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. గ్రామస్తులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

గజ్జలమ్మ ఆలయంలో సందడి



పూజలు చేస్తున్న భక్తులు

కుంటాల: కుంటాల ఇలవేల్పు శ్రీ గజ్జలమ్మ ఆలయంలో శనివారం భక్తుల సందడి నెలకొంది. గజ్జలమ్మ దేవి ఆలయ 4వ వార్షికోత్సవ సందర్భంగా దీక్షాపరులు చేపట్టిన దీక్షలను గురుస్వామి జక్కని గజేందర్ ఆధ్వర్యంలో విరమింపజేశారు. అనంతరం హుండీని లెక్కించగా రూ.60 వేల ఆదాయం సమకూరినట్లు ఆలయకమిటీ సభ్యులు తెలిపారు. కడార్ల రేవతి–హరిప్రసాద్ దంపతుల ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. ఆలయకమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మల్లన్న జాతర



ముధోల్: మండలంలోని ఎడ్‌బిడ్ గ్రామంలో శనివారం మల్లన్న జాతర ప్రారంభమైంది. మూడు రోజులు జాతర కొనసాగనున్నట్లు గ్రామకమిటీ సభ్యులు తెలిపారు. శుక్రవారం రాత్రి మల్లన్న దేవునికి గ్రామస్తుల సమక్షంలో కల్యాణ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. శనివారం గ్రామస్తులంతా చల్లనంబల్ల బోనాలను తీసుకువచ్చి మల్లన్న దేవునికి మొక్కు చెల్లించుకున్నారు.

భీమన్న దేవుని గంగస్నానం

ఖానాపూర్: పట్టణంలోని ఉత్తరవాహిని గౌతమి గోదావరినదీ తీరాన భక్తులు శనివారం భీమన్న దేవుని గంగస్నానాల ఆచరింపజేశారు. ఖానాపూర్, పెంబి మండలాల్లోని గ్రామాల నుంచి భీమన్న దేవుని గజాలతో గోదావరికి కాలినడకన తరలివచ్చారు. శనివారం పౌర్ణమి కావడంతో ప్రత్యేక పూజలు నిర్వహించారు.



ఊరేగింపుగా వస్తున్న భక్తులు

ఆలయ ప్రతిష్ఠాపనోత్సవాలు ప్రారంభం

ఖానాపూర్: మండలంలోని మస్కాపూర్ గ్రామంలో రాజరాజేశ్వర స్వామి ఆలయప్రతిష్ఠాపన ఉత్సవాలు శనివారం ప్రారంభమయ్యాయి. ఉత్సవాల్లో భాగంగా పండితులు సందీప్‌శర్మ బృందం ఆధ్వర్యంలో గణపతి పూజ, స్వస్తివాచనం, పంచగవ్య మేలనం, ప్రాచానం, రక్షాబంధన దీక్షా స్వీకారం, రుత్విక్ వరణం అఖండ దీపస్థాపనం, అంకురారోపణ, యాగశాల ప్రవేశం, షోడషస్తంభ పూజ, కర్కరీ స్థాపన, అగ్నిప్రతిష్ఠ, వాస్తు పూజ, వాస్తుబలి, నవగ్రహ మాతృత జలాధివాసం, ఆదివాస హోమాలు, తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

ముస్తాబైన పెద్దమ్మతల్లి ఆలయం

సోన్: మండలం కద్తాల్ గ్రామంలో ఆదివారం నుంచి మార్చి 3 వరకు నిర్వహించే పెద్దమ్మతల్లి విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలకు ఆలయం ముస్తాబైంది. ఆదివారం అమ్మవారి విగ్రహ ఊరేగింపు, 26న విగ్రహ ప్రతిష్ఠాపన, మార్చి 1న పోచమ్మ బోనాలు, 2న పెద్దమ్మ తల్లి బోనాలు, 3న పెద్దమ్మ తల్లి పండుగ ఉంటుందని ముదిరాజ్ కుల సంఘ సభ్యులు పేర్కొన్నారు.

ఘనంగా పల్లకిసేవ

నిర్మల్‌టౌన్: జిల్లాకేంద్రంలోని శ్రీ లక్ష్మీ వేంకటేశ్వరస్వామి దేవరకోట దేవస్థానంలో శనివారం పల్లకిసేవ ఘనంగా నిర్వహించారు. స్వామివారికి పూజా కార్యక్రమాలు చేపట్టి, వివిధ రకాల పూలతో అలంకరించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ కమిటీ చైర్మన్ ఆమెడ శ్రీధర్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

బోనాలతో ఊరేగింపు

లోకేశ్వరం: మండలంలోని పిప్రి గ్రామంలోని గ్రామ దేవతలకు శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులు బోనాల ఊరేగింపు చేపట్టారు. ప్రత్యేక పూజలు నిర్వహించి సోమవారం ఇంటికి వస్తారు.

సాయిబాబా ఆలయ వార్షికోత్సవం

లక్ష్మణచాంద: మండలంలోని మునిపెల్లి గ్రామంలో 9వ సాయిబాబా ఆలయ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం సాయిబాబా, శివలింగం, దత్తాత్రేయ, వినాయక, నంది విగ్రహాలకు భక్తులు అభిషేకం చేశారు. అనంతరం నూతన వస్త్రాలంకరణ చేశారు. తర్వాత ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా గ్రామంలో పల్లకిసేవను నిర్వహించారు. సాయిబాబా హారతి అనంతరం అన్నదానం చేపట్టారు. గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నతంగా రాణించాలి



ప్రదర్శనలు తిలకిస్తున్న రామకృష్ణగౌడ్

భైంసాటౌన్: విద్యార్థులు ఇష్టపడి చదివి ఉన్నతంగా రాణించాలని గురుకృపా విద్యాసంస్థల చైర్మన్ డా ముష్కం రామకృష్ణగౌడ్ అన్నారు. పట్టణంలోని శ్రీ గౌతమి హైస్కూల్‌లో శనివారం నిర్వహించిన అకడమిక్ ఫెయిర్ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులు చేసిన సబ్జెక్టుల వారీగా ప్రదర్శనలు తిలకించారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ శ్రీకాంత్, ప్రైవేట్ పాఠశాలల కరస్పాండెంట్లు, విద్యార్థులు పాల్గొన్నారు.